# జరిమానా

అయిలయ్య చెక్క బెంచీపై ముసలి కోతిలా ముడుచుకుని కూర్చున్నాడు.

మొట్టమొదటిసారి పామును చూసిన పసివాడిలా అతనా కోర్ట్ వాతావరణాన్ని చూసి భయపడ్డాడు.

తనో పాముల పుట్టలోకి చొచ్చుకొచ్చి కూర్చున్నట్టు అదిరిపడుతున్నాడతను.

నల్ల కోట్లు వేసుకుని అటు, ఇటూ తిరుగుతున్నవాళ్ళు నవ్వుతున్న యమభటుల్లా కనిపిస్తున్నారు అయిలయ్యకు. తనలా ఏ పనులమీదనో వచ్చి పడిగాపులు గాస్తున్నవాళ్ళు రావణుని రాజ్యంలో బందీలైన నవగ్రహ గణాల్లా కన్నుల్లో ప్రాణాలను పెట్టుకుని పంజరంలో పక్షుల్లా చూస్తున్నారు. అక్కడక్కడ తిరుగుతున్న పోలీసులు నాలుకలు చాపు కూర్చున్న బల్లుల్లా అతిగంభీరంగా కనబడుతున్నారు.

ఉదయం పది గంటల నుంచి కూర్చున్న అయిలయ్య విసిగి విసిగి సాయంత్రం నాలుగ్గంటలవరకు ఓ పాతిక బీడీలనూ రెండు అగ్గిపెట్టెలనూ కాల్చి ఓ కానిస్టేబుల్‌కు నాల్గు చాయ్‌లు తాగించి దోస్తీ చేసి కొన్ని కొత్త బూతులు నేర్చుకున్నాడు.

"ఏ జన్మలో ఏ పాపం చేసిన్నో యీ రోజు ఉమ్మిలోపడ్డ యీగలా యీ కోర్టులో చిక్కి ఏడుస్తానా" అని తుపుక్కున ఉమ్మేసి యిరవయ్యారో బీడీని అంటించుకున్నాడు.

"...హాజిర్ హో..." అని అరిచాడు మళ్ళీ బంట్రోతు.

బంట్రోతును చూచినప్పుడల్లా తన గుడిసె పక్కనున్న రైస్ మిల్లు చిమ్నీగొట్టం జ్ఞాపక మొస్తోంది అయిలయ్యకు చటుక్కున.

ఎవరో పరుగు పరుగున వెళ్ళారు జడ్జిగారున్న గదిలోకి సర్కస్ బోనులోకి నడుస్తున్న జంతువులా.

ఇంతలో ఓ పోలీసు వ్యాన్ సర్రున దూసుకొచ్చింది మెట్ల దగ్గరికి.

ఓ పోలీసు గబగబా దిగివచ్చి వెనుక డోర్ తెరిచాడు.

ఓ ఏడెనిమిది మందున్న ఆడవాళ్ళ గుంపు దిగింది.

ఒకటి-రెండు-మూడు అందరినీ పరిశీలనగాచూశాడు అయిలయ్య అందరి ముఖాలూ చెదలుపట్టిన కర్రల్లా వున్నాయి. దాంట్లో దాదాపు అందరూ పాన్‌లు నములుతున్నారు. అందువల్ల వాళ్ళ నోళ్ళన్నీ పామును తిన్న ముంగిస మూతుల్లా ఎర్రగా ఉన్నాయి. కాని వాళ్ళముఖాల్లో ఏ మాత్రం బాధలేదు. సంతోషంగానే కనిపిస్తున్నారు.

ఆడవాళ్ళంతా వరుసగా వచ్చి నిలబడ్డారు. అయిలయ్య కూర్చున్న బెంచీ ప్రక్కన.

"ఏంది సంగతి" అన్నాడు పోలీస్ దోస్తితో.

"కంపిని సరుకు"

"ఓ—"

మళ్ళీ "సరుకు" ముఖాలదిక్కు చూశాడు.

"ఎందుకొచ్చింండ్రిక్కడికి?"

"రాలేదురా ఎదవనాయాలా. పట్కచ్చింండ్రు. యియ్యాల తారీ కెంత...యిరవైయ్యారు. పోలీసుల కేస్‌ల కోటా నిండనట్లున్నది. నింపుతాండ్లు—"

"మరిప్పుడేం చేత్తరు"

"ఏమున్నదిబే. కొత్తరా, పంపుతారా. నీ లెక్కనే వాళ్ళదీ ఓ కేస్. జడ్జి అడుగుతడు. పైసేత్తడు, పొమ్మంటడు. మీరందరు పైసు కట్టాలె. పోవాలెగంతే."

"ఆ సెంక"

"వాళ్లు మల్లా కంపిని నడిపిస్తరు. నువ్వు మల్లా నడిరోడ్డుమీద నీ పండ్లబండి పెట్టి యిల్లెక్కి కూసే పుంజోలె అమ్ముకుంటవ్—"

"మరి ఈ కోరుటెందుకు, పైసెందుకు...జడ్జెందుకు"

"అదీ...అదంతే..."

"థూ....దీనమ్మ...ఏం కానూనిది. మనిషిని మారుస్తాది. బే కానూన్. అంతా బూటకం—"

"ఒరే ఎలిగా...కానూన్ గాదురా....ఈ మన జిందగీ ఉన్నది సూసినావ్ అ బ్రతుకే ఓ బూటకంరా" పోలీస్ శివయ్య వేదాంతిలా నవ్వాడు.

అయిలయ్య చేతిలోని బీడీని బెంచీ చెక్కకు రాసి సులిమి బయ టికి విసిరేసి తనకు దగ్గరగా దాదాపు తనఒంటిని తాకుతున్నట్టుగా నిలబడ్డ "సరుకు" బాపతు ఆడమనిషి దిక్కు చూశాడు.

"ఏంటీ సంగతి. ఈడకూడా గిరాకీకోసం సూత్తనవా" అన్నాడు చటుక్కున.

ఆమె ఉలిక్కిపడి అయిలయ్య దిక్కుచూచి మంటతాకినమనిషిలా ప్రక్కకు జరిగింది. "నీ పేరేంది..." అన్నాడు.

"..." ఆమె చెప్పలేదు. నిశ్శబ్దంగా చూచింది.

"అయ్యో చెప్పరాదో..." ఊరి చెరువుమీద ఊళ్ళోని ప్రతి వానికీ హక్కువున్నట్టు ఆమెమీద తనకు తెలియకుండానే తనకు సంక్రమించిన హక్కుతో అడిగాడు అధికారంగా.

"జయమ్మ" అంది ముఖం అటు తిప్పుకుంటూ.

అక్కడున్న ఎనిమిదిమంది ఆడవాళ్ళలోనూ జయమ్మే వయసుగా వుంది. కొత్తగా వుంది. వినయంగా వుంది. అయిలయ్యకు ఆశ్చర్యమేసిన యింకో విషయమేమిటంటే జయమ్మ మిగతా వాళ్ళతోకలిసి ఉండడంలేదు. వాళ్ళతో కాకులమందలో కలిసిన కోకిలలా విడిగా ముభావంగా వుంటోంది.

"నీది వాళ్ళ కంపిని కాదా"

"కాదు—"

"ఒక్కదానివి వేరేనా"

"మావోళ్ళెవరూ లేరు. నన్నొక్కదాన్నే పట్కొచ్చిండ్లు"

"కచ్చేరు కచ్చినావా యిదివరకు"

"ఊహుం...యిదే మొదలు"

"అచ్చా...మరి యీడ ఫైనేస్తే ఎవలు కడ్తరు"

"మా మనిషి యిప్పుడు వచ్చి ఓ ముప్పయి రూపాయలిచ్చి పోయిండు. ఫైనేస్తే కట్టి యిడిచేస్తే మల్లా మాపటికి వాళ్ళదగ్గరికి పోవాలె''

''పోకుంటేమైద్ది''

''అబ్బో...నన్ను మల్ల ఎంకులాడి పట్కొచ్చి గొడ్డుకొట్టినట్టు కొడ్తరు.''

"యిగ నువ్వు యీ పనినుంచి బైటపడలేవా_''

''ఊహుఁ కత్తులబోన్ల బడ్డట్టి...నా బతుకే నాశనమైపోయింది'' ఆమె ముఖం పలుగురాయిలా వున్నదల్లా కరుగుతున్న మంచుగడ్డలా ఐపోయింది

''ఐలయ్యా హాజరే...'' అని అరిచాడు బంట్రోతు

''పోవో...నువ్వే...వచ్చింది నీ పేసి...'' అన్నాడు పోలీసు అయిలయ్యను చేతిలోని కర్రతో పొడుస్తూ.

''వచ్చె—''

లేచి మాసిన అంగిని దులుపుకుంటూ బంట్రోతు దగ్గరికి ఉరికి... వాడు చూపించిన హాల్లోకి నడిచి దాకలివాని ముందర గాడిదలా అతి వినయంగా నిలబడ్డాడు.

ముందర నల్లకోటు వేసుకున్న ప్రాసిక్యూటర్ కరువబోయే పాములా ఉన్నాడు.

ఎదురుగా జడ్జి ఎవని ఏడ్పు పట్టించుకోని రాతిదేవునిలా నిర్మలంగా కూర్చున్నాడు.

''అయిలయ్య నువ్వేనా—'' ప్రాసిక్యూటర్ ప్రశ్న.

"జొన్నార్"

"రోడ్డుమీద బండిపెట్టి పండ్లమ్మావా"

"జొన్నార్"

"ఐదు రూపాయలు కట్టిపో" రాతిదేవుడు మాట్లాడాడు.

"కని...సార్ మరి మాకుడు బండోళ్ళం రోడ్డుమీద గాకుంటే మరి ఎక్కడమ్ముకోవాలె"

"ఎదురు ప్రశ్నేస్తున్నావ్..." ప్రాసిక్యూటర్.

"పది రూపాయలు ఫైన్" రాతిదేవుడు-

"అదిగాదు సార్..." యింకేదో అనబోతూండగా....

"పదిహేను రూపాయలు...." అన్నాడు జడి కఠినంగా.

అయిలయ్య బాణందిగిన పక్షిలా చూచి...నోరు మూసుకుని... చిరుగులుపడ్డ జేబులోనుంచి మాసిపోయిన పదిహేను చిల్లర నోట్లను క్లర్క్ దగ్గర కట్టి స్మశానంలోనుంచి వస్తున్న మనిషిలా బయటి కొచ్చాడు.

అతను బయట కొస్తూండగా-

"జయమ్మా హాజరే" అని అరుపు వినబడింది.

అతను చూస్తూండగానే జయమ్మ లోపలికి వెళ్ళింది సర్కస్‌లో ప్రేక్షకుల ముందునుండి బోనులోకి పోతున్న జంతువులా.

అయిలయ్య వచ్చి అరుగుపై నిలబడి ఆకాశంలోకిచూస్తూ వుండి పోయాడు.

ఐదు...మాట్లాడితే... పది...యింకా మాట్లాడితే పదిహేను, యింకా మాట్లాడితే...?

ఐదు.... పది.... పదిహేను.

"థూఁ వీన్తల్లి ఎం న్యాయం యిది."

ఒకటి...రెండు...మూడు పది నిమిషాలు గడిచాయి.

జయమ్మొచ్చింది.

ఆమె ముఖంలోకి చూశాడు. మురిగిన పండులా వుంది.

"ఏమైంది" అన్నాడు.

"పది దినాలు జేలన్నా...యిరవై ఐదు రూపాల్ జుల్మానన్నా కట్టుమన్నడు."

"ఊఁ...."

"యిరవై ఐదు కట్టిన"

తర్వాత అతను మాట్లాడలేదు. ఆమే మాట్లాడలేదు.

...నిశ్శబ్దం యిద్దరి నడుమ.

"యిగ పోదాం—" అంది కాస్సేపయింతర్వాత.

"ఏడికి"

"నేను మల్ల ఆ నరకంలకు పోతా—"

"ఆగు—"

అప్పటికే ఐదున్నరై పోయింది. చాలా మంది జనం వెళ్ళిపోయారు. నల్లబట్టలేసుకున్న లాయర్లందరూ వెళ్ళిపోతున్నారు కార్లలో.

పరిశీలనగా చూస్తున్నాడు అయిలయ్య పోతున్న నల్లకోట్లవంక- ఓ ఐదు నిమిషాల తర్వాత ఓ గున్నఏనుగులాంటి మనిషి కారుదగ్గరికి వస్తూంటే.

"ఆయినెవ్వరు..." అన్నాడు అయిలయ్య జయమ్మకుచూపిస్తూ.

"ఇంతకు ముందు మనకు జుల్మానా వేసిన జడ్జి..."

"హా..." అని గబగబా నడిచాడు. ఆమె వెంట నడిచింది.

అతను జడ్జిగారి కారుకు ఎదురుగా నిలబడ్డాడు.

"ఏందిరా" అన్నాడు జడ్జిగారు.

"అయ్యా...మాకు యింతకుముందు జుల్మా నేసిండ్లుగదా నేను రోడ్డుమీద బండిపెట్టుకోని అమ్ముకున్నందుకు, యిది ఒళ్లమ్ము కున్నందుకూ."

"ఐతే ఏమిటి."

"మరి రేపటినుంచి మేమేం జేయాలె"

"ఏం జేస్తరు...మళ్ళీ నువ్వు పండ్లమ్ముకో, అది ఒళ్లమ్ము కుంటది"

"మల్లా పట్కపై."

"మళ్ళీ ఫైనేస్తా"

"మరి మీరీ ఫైనెందు కేస్తానట్టు—"

"అది నా డ్యూటీరా పిచ్చివాడా. రోడ్డుమీద బతకడం నీ డ్యూటీ విన్నట్టుకు రావడం పోలీస్‌వాళ్ల డ్యూటీ, మీకు పైన్ వేయడం నా డ్యూటీ...."

"యిగ మా బతుకులన్నీ పైన్లేనా... యీ జుల్మానా బతుకు నుంచి మమ్ముల్ని రచ్చించండి బాబూ—"

"ఎవర్రా రక్షించేది....ఎడ్వండి రోడ్డుమీదపడి.... డ్రైవర్. పోనీ...."

కారు బాణంలా దూసుకుపోయింది.

నిలబడ్డ యిద్దరి కళ్లలోనూ దుమ్ము పడింది పూర్తిగా.